క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లిని విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనాంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్యనాధీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



కాత్యాయనికి ఆర్థికసాయం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

వేంపల్లె : ఇటీవల చిత్తూరు జిల్లా నెరబైలు హైస్కూల్‌లో నిర్వహించిన అండర్‌–19 రాష్ట్ర స్థాయి గోల్ షాట్ బాల్ పోటీలలో వేంపల్లె వైస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న కాత్యాయని జాతీయస్థాయి అండర్‌–19 పోటీలకు ఎంపికైంది. ఈనెల 29 నుంచి 1వ తేదీ నవంబర్ వరకు బీహార్ రాష్ట్రంలో బెగుసరాయ్ పట్టణంలోని ఉడ్డాన్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటుందని రాష్ట్ర గోల్ షాట్ బాల్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కాత్యాయని తండ్రి శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం లివర్ ఫెయిల్యూర్ కారణంగా మరణించారు. కుటుంబ భారం తల్లి లక్ష్మీపై పడగా, తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబ జీవనం సాగిస్తున్నారు. నందిపల్లెకు చెందిన ఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్, వైసీపీ నాయకులు మారం శ్రీకాంత్‌రెడ్డి క్రీడాకారిణికి రూ.7 వేలు సాయం అందించారు. భవిష్యత్తులో విద్య, క్రీడాభివృద్ధికి తన వంతు సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

'మానవత' సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ యోగీశ్వరబాబు

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులోని బాలిశెట్టివీధికి చెందిన షెహనాజ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. తండ్రి మరణం తర్వాత, తల్లి సాధకూన్ కూలీ పనులకు వెళితే గానీ జీవనం సాగేది కాదు. షెహనాజ్ విషయం తెలుసుకున్న వేంపల్లె మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ యోగీశ్వరబాబు, మానవతా సభ్యులతో కలిసి ఆ బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, చలపతి, గురుప్రసాద్, గంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని పోచంరెడ్డి పల్లె గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ట ముగింపు కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, యరమలపల్లె సర్పంచు సౌజన్యకుమారిరెడ్డి, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శివాంజనేయరెడ్డి, పలువురు నాయకులు ఆయన వెంట ఉన్నారు.

రైతన్నలకు అందని సబ్సిడీ శనగలు

- పంపిణీ చేయని ప్రభుత్వం
- సాగు సమయం వచ్చినా అందని శనగలు
- ప్రైవేటు వ్యక్తులవద్ద అధిక ధరకు కొనుగోలు చేస్తున్న రైతులు
- కలెక్టర్, జెడీలతో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసిన శనగ విత్తనాలు



శనగ పంట సాగుచేస్తున్న రైతు

పులివెందుల : శనగ పంట సాగుచేసే రైతులు సబ్సిడీ శనగ విత్తనాలకోసం కొద్దిరోజులనుంచి ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం రైతన్నలకు అందించాల్సిన సబ్సిడీ వేరుశనగల విషయంలో మీనమేషాలు లెక్కిస్తుంది. మరో పక్క సాగు సమయం రావడంతో చేసేదేమిలేక రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగలపై ఆశలు వదులుకున్నారు.

మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు

ప్రభుత్వం అందించాల్సిన సబ్సిడీ శనగ విత్తనాలు అందజేయకపోవడంతో రైతులు శనగల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద క్వింటా శనగలు రూ.6వేల నుంచి రూ.6.600 వరకు ధర పలుకుతోంది. సాగు సమయం ఆసన్నం కావడంతో దిక్కుతోచని రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక ధరలకు శనగ విత్తనాలు కొనుగోలు చేసి పంటను సాగుచేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

శనగ పండించే పంటకాలం దాటిపోతున్నా ప్రభుత్వానికి రైతులకు శనగవిత్తనాలు అందజేయాలనే చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం విత్తనాలు అందించే సమయానికి విత్తనసాగు కూడా పూర్తి అవుతుందని రైతులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం నకిలీ మద్యం విషయంలో చూపుతున్న శ్రద్ధ రైతులపట్ల చూపడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికే రైతులు పండించిన పంటకు ఈ ప్రభుత్వం గిట్టుబాటు ధరలేక రైతులు కుదేలవుతున్నారు. ప్రభుత్వం రాయితీగా అందించాల్సిన విత్తనాల విషయంలో కూడా అనాసక్తి చూపడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతన్నలకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేవి. సచివాలయం, ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర సేవలు విరివిగా అందేవి. రైతులు ఎక్కడికి పోవాల్సి అవసరం లేకుండా తమకు కావాల్సిన వ్యవసాయ అవసరాల కోసం ఆర్బీకేలు, సచివాలయాలను సంప్రదిస్తే ఒకటి, రెండురోజుల్లో రైతులకు అందేవి. అయితే ఈ ప్రభుత్వం ఆవ్యవస్థను పూర్తిగా అటకెక్కించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టర్, జేడీలతో మాట్లాడిన ఎంపీ

రైతులకు సబ్సిడీ శనగల పంపిణీ విషయంపై ఇటీవల కొంతమంది రైతులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీనికి ఎంపీ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీలతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు వెంటనే సబ్సిడీ వేరు శనగలు అందజేయాలని ఎంపీ వారిని కోరారు. రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని ఎంపీకి అధికారులు తెలియజేశారు.

అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం



ప్రభుత్వం శనగ పంట సాగు చేసే సమయానికి సబ్సిడీ విత్తనాలు అందించడం లేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక ధరలకు శనగ విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగుచేస్తున్నాం. రైతులపట్ల ప్రభుత్వానికి వివక్ష తగదు.

– శివశంకర్‌రెడ్డి, రైతు, మబ్బుచింతలపల్లె

అధికారులు పట్టించుకోవడం లేదు



సబ్సిడీ వేరుశనగలపై అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదు. పంట సాగు సమయం మించిపోతుండటంతో మా పరిస్థితి ఏమిటో అర్థం కావడంలేదు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది.

– చలపతి, రైతు, వేముల

దీపావళి శుభాకాంక్షలు



పి.నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజుల రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ కాలంలో నరకాసురుడిని సత్యభామ వధిస్తే దీపావళి పండుగ చేసుకోవడం జరిగిందన్నారు. చెడుపై ఎప్పుడూ మంచే గెలుస్తుందని, ప్రజల మనసు చూరగొన్న జననేత జగనన్నే తిరిగి గెలుస్తాడని, 2029లో జగనన్నే సీఎం అవుతాడని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు సంతోషంగా దీపావళి పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం



తన స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1998 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తన తోటి విద్యార్థి వడ్డే రమేష్ కుటుంబానికి రూ.63,550 నగదును ఆర్థిక సాయం అందించారు. ఈనెల 13వ తేదిన వడ్డే రమేష్ ఆనారోగ్య కారణంగా మృతి చెందాడు. ఇతనికి భార్యతో పాటు ముగ్గురు సంతానం. మృతుడు రమేష్ 1998లో పదవ తరగతి పూర్తి చేశారు. తన స్నేహితుడు కుటుంబానికి అండగా నిలుస్తామని వారు తెలిపారు.

రెడ్డి అధికారులపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం

పులివెందుల టౌన్ : తాళ్లపొద్దుటూరు ఎస్‌ఐ హృషీకేశ్వరరెడ్డిని సస్పెండ్ చేసిన ఘటనపై రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అధికార పదవుల్లో ఉన్న రెడ్డి అధికారులపై ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకుంటున్న తీరు ప్రజాస్వామ్యానికి తగినది కాదని ఆర్సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిని అవినీతి పేరుతో సస్పెండ్ చేయడం.. ఇప్పుడు తాళ్ల పొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వరరెడ్డిపై కూడా ఆరోపణలు చేసి సస్పెండ్ చేయడం వెనుక రాజకీయ ఉద్దేశ్యాలు ఉన్నాయన్నారు. ఈ విధంగా ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికి చెందిన అధికారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం ప్రభుత్వం యొక్క వైఖరి పక్షపాతం, ప్రతీకార రాజకీయాల ప్రతీక అన్నారు. ప్రభుత్వం నిజంగా అవినీతి వ్యతిరేకంగా వ్యవహరిస్తే, అన్ని వర్గాల అధికారులపై ఒకే ప్రమాణంతో విచారణ జరగాలి. కానీ ఇక్కడ మాత్రం ×రెడ్డి అనే పేరున్న అధికారులను మాత్రమే టార్గెట్ చేస్తూ సస్పెన్షన్ వర్షం కురిపించడం గమనార్హమన్నారు. ఇలాంటి వివక్షాత్మక చర్యలు కొనసాగితే, రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి కమ్యూనిటీ భారీ స్థాయిలో ఆందోళనలు చేపడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ చర్యలను సమీక్షించి, అన్యాయంగా సస్పెండ్ చేసిన అధికారులను విధుల్లోకి పునర్నియమించాలని ఆర్సీడీఎస్ డిమాండ్ చేస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వం గద్దె దిగాలి

వీరపునాయునిపల్లె : రైతు వ్యతిరేఖ కూటమి ప్రభుత్వం గద్దె దిగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పించడం, నష్ట పరిహారం అందించడం, సకాలంలో సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించడంలో ముందుండేదన్నారు. కూటమి ప్రభుత్వం అటువంటి కార్యక్రమాలు చేపట్టకపోగా రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతుల తరపున ఉద్యమాలు చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నిజన్మలెత్తినా సూపర్ సిక్స్ అమలు చేయలేరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగమైన సూపర్ సిక్స్‌ను ఎన్ని జన్మలెత్తినా అమలు చేయలేరని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో గ్రామ, వార్డుల కమిటీలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడంతోపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవటానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఆరోగ్యశ్రీ అమలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానితోపాటు రాష్ట్రానికి వచ్చిన మెడికల్ కాలేజిలను మొత్తం ప్రవేట్ పరం చేసి నిరుపేద విద్యార్థులకు వైద్యవిద్య అందకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం అందకుండా చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ప్రతి హామీని అమలు చేసిన వ్యక్తిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీని వార్డుల్లో బలోపేతం చేయడం కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని ప్రతి ఒక్కరు తమ తమ వార్డుల్లో ప్రజలను కలిసి ప్రభుత్వ వైఫల్యాలను వివరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, హనుమంతరెడ్డి, ముల్లాజానీ, పోచిరెడ్డి, గౌరీనాథ్, లక్షుమయ్య, సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలు పరిశీలన



టపాసులు దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఎర్రగుంట్ల : స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో పెట్టిన టపాసుల దుకాణాలను అదివారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు పాటించాలన్నారు. దుకాణం వద్ద ఇసుక, నీరు, మంటను ఆర్పే ఫైర్ గ్యాస్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే జరిగే ప్రమాదానికి దుకాణాల యజమానులు బాధ్యతవహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగమురళి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలందిస్తున్న వైద్య నిపుణులు

వల్లూరు : మండల పరిధిలోని గణేష్‌పురం బస్టాండు వద్ద కడపకు చెందిన లాస్య ఆర్థో, స్కిన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డెర్మటాలజీ అండ్ కాస్మోటాలజీ వైద్య నిపుణులు అంపాబత్తిని జ్యోతి, ఎముకలు, నరములు, వెన్నుపూస, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు పిచ్చిక గీతకుమార్, జనరల్, డయాబెటిస్ వైద్య నిపుణులు శౌధర్‌లు శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలి

చింతకొమ్మదిన్నె : భారతదేశ ఉత్పత్తులనే వినియోగించాలని కోరుతూ ఆదివారం బయనపల్లిలో ఇంటింటా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ కమలాపురం నియోజకవర్గ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ



మాట్లాడుతున్న ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా

వేంపల్లె : ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిన్నటి రోజున గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, రాష్ట్ర ముఖ్యమంత్రి జరిపిన చర్చలు నిరాశ కలిగించాయని కడప జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఇలియాస్‌బాషా అభిప్రాయపడ్డారు. ఆదివారం వేంపల్లి ఎస్‌టీయూ రీజియన్ కార్యాలయంలో కన్వీనర్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ, నాలుగు పెండింగ్ డీఏల చెల్లింపు పై కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నప్పటికీ సాక్షాత్తు ముఖ్యమంత్రితో చర్చలు జరిపిన తర్వాత కూడా కేవలం ఒక డీఏ ఇచ్చి కంటితుడుపు ప్రకటనగా చూడవలసి వస్తుందని ప్రభుత్వ తీరుపై రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ చెందారన్నారు. 12వ పి.ఆర్.సికి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు ఎప్పటినుంచి ఇవ్వనున్నారో కూడా ప్రకటించకపోవడం ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను తీర్చడంపై ప్రభుత్వ శీతకన్ను వేసినట్లు అనిపిస్తోందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు అలాగే 2025 జూన్ లో బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫిర్దౌస్ జహాన్‌ను, ఆర్పరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జనార్దన్‌రెడ్డిని సత్కరించారు. వేంపల్లె, చక్రాయపేట మండలాలకు నూతన కార్యవర్గాలను ఎంపిక చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రాధాన కార్యదర్శి చౌటిపల్లి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం అనంతరం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సింగిరాల రాఘురాం, అధ్యక్షుడు సాంబశివరావుల ఆధ్వర్యంలో యూనియన్ అభివృద్ధికి తోడ్పతామన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఉద్యామాలు చేస్తామన్నారు.

బాలచంద్రారెడ్డికి డాక్టరేట్ ప్రదానం



పులివెందుల టౌన్ : స్థానిక జేఎన్‌టీయూ కలశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కాకర్ల బాలచంద్రారెడ్డికి క్లౌడ్ సెక్యూరిటీ విభాగంలో పరిశోదన చేసినందుకు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా లభించింది. జేఎన్‌టీయూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తు చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీలో నాలుగు సంవత్సరాలుగా డాక్టర్ ఎస్.మీరా ఆధ్వర్యంలో క్లౌడ్ సెక్యూరిటీపై పరిశోధనలు చేసినందుకు గాను పట్టా అందుకున్నట్లు ఆయన తెలిపారు.

కుంటలుగా మారిన గ్రామ వీధులు

- రోడ్లపైకి మురికినీరు
- నెలల తరబడి గ్రామంలో నిలిచిన మురికినీరు
- పట్టించుకోని అధికారులు



చిన్నకొమెర్ల గ్రామ నడిబొడ్డున ఉన్న కుంట

మైలవరం : మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామం మురికి కుంటలా తయారైంది. గ్రామానికి అభివృద్ధికోసం రూ.60 లక్షలు నిధులు ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులు వాడనివ్వకుండా ఆటంకాలను సృష్టిస్తుంది. దీంతో గ్రామం నడిబొడ్డున ఉన్న కుంట ఇటీవల కురిసిన వర్షాలకు, గ్రామస్తులు వదులుతున్న మురికినీరు సైతం ఈ కుంటలోనికి పోతుంది. ప్రస్తుతం కుంట వర్షాలకు పూర్తి స్థాయిలో నిండిపోవడంతో కుంటలోనుంచి మురికినీరంతా గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా రోడ్లుపైనే నిలబడిపోతుంది. దిగువప్రాంతంలో ఉన్న ఇంట్లలోనికి మురికినీరు వచ్చి చేరుతుండటంతో స్థానిక ప్రజలు మోటర్లు వేసి మురికినీటిని బయటకు పంపించిన ప్రయోజనం లేకుండాపోతుంది. ఎంత ఖర్చు చేసిన మురికినీటితో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మా గ్రామానికి సమీపంలోనే దాల్మియా పరిశ్రమ ఉన్నా వారు కూడా గ్రామం గురించి పట్టించుకోవడంలేదని ప్రజలు తెలుపుతున్నారు.



ఇంట్లోకి మురికి నీరు పోవడంతో మోటర్‌ద్వారా పంపింగ్ చేసుకుంటున్న స్థానికులు



రోడ్డుపైనే మురికినీరు